క్లుప్తంగా...

ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



ఎమ్మెల్సీ కవితకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

మేడ్చల్: పట్టణంలోని మూడవ వార్డులో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం, అమరవీరుల స్తూపం ప్రారంభించేందుకు హాజరు కావాలని ఎమ్మెల్సీ కవితను బీఆర్ఎస్ నాయకులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి, నాయకులు ప్రవీణ్‌కుమార్, చంద్రారెడ్డి, సత్యపాల్‌రెడ్డి, పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన మునీరాబాద్ నాయకులు



మంత్రి మల్లారెడ్డి మునీరాబాద్ నాయకులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని మునీరాబాద్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు బుధవారం మంత్రి మల్లారెడ్డిని కలిశారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కుతాడి నరేందర్ ఆధ్వర్యంలో మంత్రి నివాసంలో ఆయనను కలిసి గ్రామంలోని పలు కాలనీల్లో సీసీ రోడ్డు పనులు చేపట్టాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలో గ్రామ పర్యటన చేస్తానని, రోడ్డు పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజు, నవీన్, మహేశ్, రజినీకాంత్, సురేశ్, అనిల్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న కౌన్సిలర్ కొడే మహేష్

మేడ్చల్: పట్టణంలోని 23వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో కౌన్సిలర్ కొడే మహేష్ పిల్లలకు పుస్తకాలను అందజేశారు. వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలు, తల్లులకు పౌష్టికాహారం పంపిణీపై వాకబు చేశారు. అంగన్‌వాడీ టీచర్లు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరింపజేస్తానని అన్నారు. కార్యక్రమంలో టీచర్ ఇందిరమ్మ, ఆయాలు మణెమ్మ, సంధ్యారాణి, ఆశ వర్కర్లు సునీత, వసంత, లక్ష్మీ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న మొహర్రం పర్వదినాలు



23వ వార్డులో ఇమామ్ కాసీం పీర్లు

మేడ్చల్: త్యాగాలకు గుర్తుగా ముస్లింలు జరుపుకునే మొహర్రం పర్వదినాలను మేడ్చల్‌లో నిర్వహిస్తున్నారు. పట్టణంలోని పీర్ల ఆషూర్‌ఖానాలో ఇమామ్, కాసీం పీర్లను ఏర్పాటు చేసి నిత్యం ప్రార్థనలు చేస్తున్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలు పాల్గొంటున్నారు. 23వ వార్డు కౌన్సిలర్ కొడే మహేష్ పీర్లను దర్శించుకున్నారు.

రాయిలాపూర్‌లో మొక్కలు నాటిన జవాన్లు



రాయిలాపూర్‌లో మొక్కలు నాటుతున్న సైనికులు

మేడ్చల్: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మండలంలోని రాయిలాపూర్ గ్రామంలో బేగంపేట్ ఎయిర్ ఫోర్స్ అకాడమికి చెందిన మిలటరీ సైనికులు మొక్కలు నాటారు. జవాన్లు రాయిలాపూర్ గ్రామంలో స్థానికులతో కలిసి మొక్కలు నాటారు. విజయ్ దివస్‌కు గుర్తుగా మొక్కలు నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్మద గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ అనూపశ్రీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రఘుపతిరెడ్డి, గ్రామస్తులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో

ఖాళీల భర్తీకి కసరత్తు

- టీచర్లు, ఆయాల ఖాళీల వివరాల సేకరణలో అధికారులు నిమగ్నం
- గ్రేటర్ సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 331 ఖాళీలు
- విద్యార్హతను పదవ తరగతి నుంచి ఇంటర్మీడియెట్‌కు పెంచిన కేంద్రం



సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయాల పోస్టులను భర్తీ చేసేందుకు మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయో సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. నగరంతో సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం 3,307 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 3.43 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో హైదరాబాద్ జిల్లాలో 914 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 1,19,800 మంది లబ్ధిదారులు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 794 కేంద్రాల్లో 95,017 మంది లబ్ధిదారులు, రంగారెడ్డి జిల్లాలో 1600 కేంద్రాల్లో 1,70,797 మంది లబ్ధిదారులు ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య, పెరిగిన లబ్ధిదారులకు అనుగుణంగా ప్రస్తుతం పనిచేస్తున్న వారే కాకుండా.. అదనంగా టీచర్లు, ఆయాల పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఖాళీగా ఉన్న స్థానాల్లో కొత్త వారిని నియమించేందుకు ఆయా జిల్లాల మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఉద్యోగాల భర్తీకి ఇది వరకు పదో తరగతి విద్యార్హత ఉండేది. కొత్త నియామకాలకు అభ్యర్థులు తప్పని సరిగా ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలని కేంద్రం నిర్ణయించింది.

ఖాళీల పరిస్థితి ఇలా..

గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, హెల్పర్ పోస్టులు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం పోస్టులు 167 ఖాళీగా ఉండగా, ఇందులో టీచర్ పోస్టులు 42, హెల్పర్లు 125 ఖాళీగా ఉన్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 124 పోస్టులు ఖాళీగా ఉండగా, ఇందులో 21 టీచర్లు, 103 హెల్పర్ పోస్టులు, రంగారెడ్డి జిల్లాలో 40 పోస్టులు ఖాళీగా ఉండగా, ఇందులో టీచర్ పోస్టులు 8, హెల్పర్ పోస్టులు 32 ఖాళీగా ఉన్నాయి.

విధుల నిర్వహణలో వీరే కీలకం

అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య, ఆరోగ్య రక్షణ చర్యలతో పాటు గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యానికి ఆరోగ్యలక్ష్మి పథకం అమలు వంటి విధులు నిర్వహణలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పాత్ర కీలకంగా ఉంటుంది. ఒకటి నుంచి ఆరు సంవత్సరాలలోపు పిల్లలు అంగన్‌వాడీ సెంటర్లకు వస్తారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కలిసి పిల్లలను ఇళ్ల వద్ద నుంచి తీసుకువస్తారు. పిల్లల చేతులు కడగటం, ఉడికించిన కోడిగుడ్లు ఇవ్వటం, అవి తిన్న తరువాత వండిన పౌష్టికాహారం పెట్టడం వంటి విధులను వారు నిర్వహిస్తారు. పసి పిల్లలు కావడంతో వారి వ్యక్తిగత శుభ్రత విషయంలో హెల్పర్లు చాలా జాగ్రత్తలు తీసుకుంటారు.

వివరాలు సేకరిస్తున్నాం

హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టుల వివరాలు సేకరిస్తున్నాం. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. అనుమతి రాగానే భర్తీ ప్రక్రియకు నోటిఫికేషన్ వెలువడుతోంది.

– అక్కేశ్వర్‌రావు, మహిళా, శిశు, సంక్షేమాధికారి, మేడ్చల్(ఇన్‌చార్జి)

పోస్టుల వివరాలు..

జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాలు	లబ్ధిదారుల సంఖ్య	ఖాళీ పోస్టులు
హైదరాబాద్	914	1,19,800	167
మేడ్చల్	794	95,017	124
రంగారెడ్డి	1600	1,78,797	40
మొత్తం	3,307	3,43,694	331

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆందోళనలో యూనియన్ రాష్ట్ర నేత శ్రీనివాస్



సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్న డిమాండ్‌తో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. 21 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లాలోని పలు మండలాల్లో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన మానవహారం, ధర్నా కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పంచాయతీ కార్మికులకు పీఆర్సీ, బీమా చెల్లించాలన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన వెంటనే కార్మికులను పర్మినెంట్ చేస్తామని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఇప్పటికీ జీతాల బకాయి కూడా చెల్లించడం లేదని విమర్శించారు. గ్రామపంచాయతీ కార్మికులకు ప్రతినెలా జీతాలు రెగ్యులర్‌గా ఇవ్వాలన్నారు. సబ్బులు, నూనె, బట్టలు, చెప్పులు కూడా ఇవ్వడం లేదన్నారు. సమస్య పరిష్కరించకపోతే సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమాల్లో గ్రామ పంచాయతీ జిల్లా నాయకులు సుధాకర్, కృష్ణ, రవి, ముత్యాలు, ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు .

పంచాయతీ కార్మికుల ర్యాలీ

మేడ్చల్: సమ్మెలో భాగంగా పంచాయతీ కార్మికులు బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. 20 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులు మండల పరిషత్ కార్యాలయం నుంచి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి తమ డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ యూనియన్ నాయకులు ర్యాలీలో పాల్గొని మద్దతు తెలిపారు. ర్యాలీలో జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు అశోక్, నాయకులు సుధాకర్, రాంచందర్, బాబు, నీలమ్మ, సంతోష, నర్సింహ, రాజు, ఎల్లమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

- ప్రజల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి
- వైద్య సేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు
- వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్



సాక్షి, మేడ్చల్ జిల్లా: వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు, ఆరోగ్య సిబ్బందిని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లు, ప్రైమరీ – అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ మెడికల్ ఆఫీసర్లు, రిపోర్టింగ్ సూపర్‌వైజర్స్ అండ్ డేటాఎంట్రీ ఆపరేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్, మందులు, ఫ్లూయిడ్స్,యాంటి స్నేక్,యాంటి రాబీస్ ఇంజెక్షన్లు తగిన మోతాదులో ప్రజలకు అందుబాటులో ఉంచాలని శ్రీనివాస్ కోరారు. వైద్యులతోసహా జిల్లాలో నూతనంగా నియమితులైన 974 ఆశ కార్యకర్తలు,ఏఎన్ఎంలు హౌజ్ టు హౌస్ సర్వే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి డెంగ్యు,మలేరియా, అతి సార వ్యాధిని నియంత్రించాలనిఆయన ఆదేశించారు. సకాలంలో డెంగ్యు, మలేరియా ఇతర వ్యాధిగ్రస్తుల వివరాలు సేకరించి నివేదిక అందజేయాలన్నారు. మున్సిపల్ శాఖ అనుసంధానంతో స్ప్రాయింగ్ ఆక్టివిటీ నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు ఏలాంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేదా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేదా బస్తీ / పల్లె దవాఖానలను సందర్శించే విధంగా ప్రోత్సహించాలన్నారు. లోతట్టు ప్రాంతములో నివసించే వారికి ఎమర్జెన్సీ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ,ఆరోగ్యసేవలు అందించాలని జిల్లా వైద్య – ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాస్ సూచించారు.ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా ఆదివారం, సెలవు దినాల్లో కూడా అన్ని ఆరోగ్య సౌకర్యాలు పరీక్షలు, అవసరమైన మందులు సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది అలసత్వాన్ని విడనాడి ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకు అందుబాటులో ఉండలన్నారు.ఏలాంటి ఫిర్యాదులు వచ్చినా ఉపేక్షించేది లేదన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

న్యాయమైన పరిహారం చెల్లించాలని వినతి

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన భూనిర్వాసితులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని అఖిలపక్ష నాయకులు కలెక్టరేట్‌లో బుధవారం వినతి అందజేశారు. 2017లో ప్రారంభమైన వంతెన పనుల్లో కేంద్ర ప్రభుత్వం తమవంతు పనులు పూర్తి చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం, భూనిర్వాసితులకు సరైన పరిహారం ఇవ్వకపోవడం అలసత్వానికి కారణమన్నారు. గతంలో రహదారి విస్తరణ భూబాధితులకు పరిహారం చెల్లించకుండా కొండాపూర్‌లో 60 గజాల స్థలాన్ని కేటాయించి భౌతికంగా స్థలం చూపించలేదన్నారు. ప్రస్తుతం 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించి మున్సిపాలిటీలో 60 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని లేఖలో కోరారు. అఖిలపక్ష నాయకులు హనుమాన్, మహేశ్‌గౌడ్, లక్ష్మారెడ్డి, యాదగిరి యాదవ్, యాదయ్య, జయచంద్ర, రాధాకృష్ణముదిరాజ్, ఆంజనేయులు, భూషణం, సబితా, శంకర్‌ముదిరాజ్, పోచయ్యముదిరాజ్, స్వరూప, జ్యోతి వినతి అందజేశారు.



వక్ఫ్‌బోర్డు భూమిని అందుబాటులోకి తేవాలి

మేడ్చల్: పట్టణంలోని సర్వే నంబర్–8లో ఉన్న వక్ఫ్ బోర్డు భూమిని అందుబాటులోకి తేవాలని ముస్లిం నాయకులు మంత్రి మల్లారెడ్డిని బుధవారం కోరారు. అందుకు మంత్రి స్పందించి వక్ఫ్ బోర్డు చైర్మన్‌తో చర్చించారు. అనంతరం ముస్లింలతో మాట్లాడుతూ.. వీలైనంత తొందరగా ఆ భూమిలో షాదీఖానా, మినీ ఫంక్షన్ హాల్ కట్టి వినియోగంలోకి తెస్తామన్నారు. ఖబరస్థాన్‌కు ప్రహరీ గోడ కట్టిస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికా నర్సింహారెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ముస్లిం పెద్దలు, నాయకులు తదితరులున్నారు.

అభివృద్ధికి నిధులివ్వండి

కీసర: నాగారం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రి మల్లారెడ్డిని చైర్మన్ చంద్రారెడ్డి కోరుతూ బుధవారం వినతిపత్రం అందజేశారు. రాంపల్లి చౌరస్తా నుంచి ఘట్‌కేసర్ వరకు రోడ్డు, వరద నీటి నాలా నిర్మాణం పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, నాయకులు అంజయ్యగౌడ్, పెంటయ్య, రాములు ఉన్నారు.

రైల్వే వంతెన టెండర్ ప్రక్రియ పూర్తి

ఘట్‌కేసర్: రైల్వే వంతెన టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, త్వరలో వంతెన పనులను తిరిగి ప్రారంభిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో బుధవారం ఆమె మాట్లాడుతూ రోడ్డు భవనాల శాఖ అధికారుల సమాచారం మేరకు కేఎస్సార్ ఇన్‌ఫ్రా హోల్డింగ్ టెండర్ దక్కించుకుందన్నారు. మంత్రి మల్లారెడ్డి సాయంతో దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే వంతెన పనులు తిరిగి ప్రారంభించి ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తామన్నారు.

బీఆర్ఎస్‌లో పెద్దఎత్తున చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: పట్టణంలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి మల్లారెడ్డి నివాసంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 8వ వార్డు అభివృద్ధికి మంత్రి మల్లారెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. రమేష్, సుశీల్‌కుమార్, నవీన్‌కుమార్, సాయికుమార్, సుధాకర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి తదితర నాయకులు ఉన్నారు.



మంత్రి మల్లారెడ్డితో మయోర కంపెనీ కార్మికులు

కార్మిక మంత్రిని కలిసిన మయోర కంపెనీ కార్మికులు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మయోర కంపెనీ కార్మికులు మంత్రి మల్లారెడ్డిని కలిశారు. కంపెనీలో కార్మికులు నూతనంగా బీఆర్‌టీయుకు అనుబంధంగా యూనియన్‌ను ఏర్పాటు చేసుకుని కమిటీని నియమించుకుని మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. జిల్లా బీఆర్‌టీయు అధ్యక్షుడు ప్రభాకర్, కార్మిక నాయకులు సంతక్షన్, కుమార్, బాలమల్లేష్, నర్సింలు, మహేష్, ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎయిర్‌ఫోర్స్ అధికారులు



దేవరయాంజాల్‌లో మొక్కలు నాటుతున్న ఎయిర్‌ఫోర్స్ అధికారులు

శామీర్‌పేట్: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా హకీంపేట ఎయిర్‌ఫోర్స్ అధికారులు తూముకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో అమరులైన జవాన్లను స్మరించుకున్నారు. అనంతరం దేవరయాంజాల్ ప్రభుత్వ పాఠశాల, మేడ్చల్ జిల్లా వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హకీంపేట ఎయిర్ ఫోర్స్ స్టేషన్ సెక్యూరిటీ అధికారి ఎస్‌కే రెడ్డి, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ బీవీఎస్ బాబు, అసిస్టెంట్ పర్యావరణ అధికారి యన్‌కే సుహాగ్, మున్సిపల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, తూముకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ఎయిర్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

మేడ్చల్: పట్టణంలో పురాతన ఆలయాల్లో ఒకటైన రామలింగేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ ధాత్రిక రాధాకృష్ణ మంత్రి మల్లారెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా రాధాకృష్ణను నియమించడంతో ఆయన మంత్రిని కలిసి ఆలయ అభివృద్ధిపై చర్చించారు. పురాతన ఆలయం కావడంతో అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు మధుకర్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.



మంత్రితో రామలింగేశ్వర ఆలయ కమిటీ చైర్మన్, నేతలు

భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉన్నాం

టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అత్యవసర చర్యలు చేపట్టాలన్న ఆదేశాలతో జిల్లాలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. బుధవారం టెలీకాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన మేరకు జిల్లాలో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా జిల్లా అధికార యంత్రాంగం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసేలా హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తినట్లయితే.. అత్యవసర సేవలు అందించేందుకు కలెక్టరేట్ టోల్ ఫ్రీ నంబర్ 94924-09781కు ఫోన్ చేయాలని కలెక్టర్ అమయ్ కుమార్ ప్రజలను కోరారు.

ఇంట్లో నుంచి బయటకు రావొద్దు

ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇంట్లో నుంచి బయటకు రావొద్దని కలెక్టర్ అమయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించడంతో పాటు అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు.

ఈ ఫోన్ నంబర్లను సంప్రదించండి

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఫోన్ నంబర్ 040--27215959, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 99639-96908, 8074064746, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 040--29569700, ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 73311-64056, దమ్మాయిగూడ మున్సిపాలిటీలో 96667-03077, దుండిగల్ మున్సిపాలిటీలో 95427-15377, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో 91540-83772, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో 81435-89845, కొంపల్లి మున్సిపాలిటీలో 18004257590, మేడ్చల్ మున్సిపాలిటీలో 93920-11506, 86390-50325 , నాగారం మున్సిపాలిటీలో 96400-10053, పోచారం మున్సిపాలిటీలో 89857-73105, తూంకుంట మున్సిపాలిటీలో 91542-79694.

నాణ్యమైన మెటీరియల్ వినియోగించాలి

ఘట్‌కేసర్: మున్సిపల్ అభివృద్ధి పనుల్లో నాణ్యమైన మెటీరియల్ వినియోగించాలని చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సాబేర్ అలీ, కాంట్రాక్టర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో కొనసాగుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ ఏఈ నరేశ్, మేనేజర్ అంజిరెడ్డి, కాంట్రాక్టర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

ఘట్‌కేసర్: వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. మున్సిపాలిటీ కార్యలయం ఆవరణలో కమిషనర్ సాబేర్ అలీతో కలిసి పారిశుద్ధ్య కార్మికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంటు వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. స్వచ్ఛ ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. మేనేజర్ అంజిరెడ్డి, మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.